క్లుప్తంగా

ఆర్థికసాయం అందజేత

బిజినేపల్లి: మండల కేంద్రానికి చెందిన సుల్తాన్ అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు నెల్లికంటి మహేశ్వర్‌రెడ్డి బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ఓదార్చారు. అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేల ఆర్థికసాయం అందజేశారు.

ముగిసిన పల్స్ పోలియో



కోడేరు: మండలంలోని మూడు రోజుల పాటు కొనసాగిన పల్స్‌పోలియో కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. మండలంలో మొత్తం 3,998 చిన్నారులకు గాను మొత్తం వంద శాతం పల్స్ పోలియో చుక్కలు వేసినట్లు డాక్టర్ దశరథం తెలిపారు. మంగళవారం ఇంటింటికి వెళ్లి నంబర్లను వేశారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మన్ననూర్: అమ్రాబాద్ మండలం మన్ననూర్ గిరిజన ప్రాథమిక, ఉన్నత, ఉమామహేశ్వ కాలనీ, అంబేడ్కర్ కాలనీలలో ఉన్న పాఠశాలలను ఎస్ఎస్‌యూఐ జిల్లా ప్రచార కార్యదర్శి నల్లవెల్లి యశ్వంత్ సందర్శించారు. పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలను ఎమ్మెల్యే వంశీకృష్ణ దృష్టికి తీసుకెళ్లి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ నాయకులు కార్తీక్, యశ్వంత్ పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలకు విరాళం

కల్వకుర్తి: పట్టణంలోని ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాల అభివృద్ధికి నేతాజీ యువజన సంఘం సభ్యులు ముందుకువచ్చారు. ఆర్చీ నిర్మాణం కోసం రూ.లక్ష విరాళంగా మంగళవారం కళాశాల ప్రిన్సిపాల్ శార్వాణికి అందించారు. కళాశాల అభివృద్ధి కోసం మరికొంత మంది విరాళాలు అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ దాతలను సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు, దాతలు పాల్గొన్నారు.

మార్కెట్ చైర్మన్‌గా అవకాశం కల్పించాలి

బల్మూర్: కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలంగా పనిచేస్తున్నానని, పార్టీ సిద్ధాంతాలు కట్టుబడి బలోపేతానికి కృషి చేస్తున్నానని ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు వెంకటయ్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 25 ఏళ్ల నుంచి తాను పార్టీలో కొనసాగుతూ వార్డు సభ్యుడితో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్‌గా, పార్టీ మండల బాధ్యుడిగా పని చేస్తున్నానని వివరించారు. ప్రస్తుతం అచ్చంపేట వ్యవసాయ మార్కెట్ చైర్మన్ ఎస్సీ మహిళకు రిజర్వు అయ్యిందని తన సతీమణికి చైర్మన్‌గా అవకాశం కల్పించాలని ఎమ్మెల్యే డా. వంశీకృష్ణను కోరారు.

కరపత్రాలు విడుదల

ఉప్పునుంతల: పదర మండలంలోని లక్ష్మీ చెన్నకేశవ స్వామి రాయలగండి జాతరకు సంబంధించిన కరపత్రాలను మంగళవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వాహకులు స్థానిక నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈనెల 11 నుంచి 16వ తేదీ వరకు రాష్ట్ర స్థాయిలో వాలీబాల్ టోర్నమెంట్స్, కోలాటం, భజన పోటీలు, నాటక ప్రదర్శన ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. అదేవిధంగా ధ్వజ స్తంభం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. నాయకులు అనంతరెడ్డి, మల్లికార్జున్, నాసరయ్య, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, బాలస్వామి, రాంచంద్రయ్య పాల్గొన్నారు.

నల్లమల సందర్శనకు సీతక్కకు ఆహ్వానం



మన్ననూర్: అనూష ప్రాజెక్టు ప్రైవేటు లిమిటెడ్ వారి సౌజన్యంతో మాచారంలో నిర్వహిస్తున్న ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి హాజరుకావాలని ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణతో కలిసి ఆ ప్రాజెక్టు అధినేత జలంధర్‌రెడ్డి సీతక్కను ఆహ్వానించారు. మంగళవారం హైదరాబాద్‌లో రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి సీతక్కను వారు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 9వ తేదీన తప్పకుండా నల్లమలకు వస్తానని మంత్రి హామీ ఇచ్చారని వారు పేర్కొన్నారు. రామకృష్ణారెడ్డి, మధుసుధన్‌రెడ్డిలు ఉన్నారు.

గృహిణికి రెండు ఉద్యోగాలు

కందనూలు: జిల్లా కేంద్రానికి చెందిన గృహిణి రఫీయాబేగం ఇటీవల విడుదలైన గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగ ఫలితాల్లో పీజీటీ విభాగంలో రాష్ట్ర స్థాయిలో 39వ ర్యాంకు సాధించింది. అదేవిధంగా టీజీటీ ఫలితాల్లో కూడా ప్రతిభ కనబర్చింది. ఒకేసారి రెండు ఉద్యోగాలు సాధించిన మహిళను పలువురు అభినందించారు.

రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు



వెల్దండ మండలం అజిలాపూర్‌లో మల్లీశ్వరస్వామి



పెద్దకొత్తపల్లిలో విగ్రహాల ఊరేగింపునకు హాజరైన భక్తులు

వెల్దండ: మండలంలోని అజిలాపూర్‌లో ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు మల్లీశ్వరస్వామి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు కేశమోని అండాలు, నర్సింహ్మగౌడ్‌లు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 7న ఉదయం పుట్ట బంగారు తెచ్చి అలంకరణ, రాత్రి 7గంటలకు స్వామివారి శోభాయాత్ర, 8న స్వామివారికి ప్రత్యేక అభిషేకం, పల్లకీ సేవ, రాత్రి 12గంటలకు మల్లీశ్వర స్వామి కల్యాణోత్సవం, 9న మల్లన్న, ఎల్లమ్మ తల్లికి బోనాల పండుగ ఉంటుందని వివరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. అదేవిధంగా గుండాలలో ఈనెల 7 నుంచి ప్రారంభమయ్యే అంబా రామలింగేశ్వరస్వామి ఉత్సవాలకు ఏర్పాట్లను పూర్తి చేయాలని ఎస్ఐ రవి పేర్కొన్నారు. వాహనాల పార్కింగ్, తాగునీరు ఏర్పాట్లు, తదితర అంశాలను పరిశీలించారు.

విగ్రహాల ఊరేగింపు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన వాసవీ కన్యకాపరమేశ్వరి హరిహర క్షేత్రంలో గురువారం ప్రతిష్ఠించనున్న నవగ్రహాలతో పాటు వాసవీ కన్యకాపరమేశ్వరి, రామలింగేశ్వరి స్వామి, విగ్రహాలను మంగళవారంలో గ్రామంలో ఊరేగించారు. ఆలయం నుంచి శివాలయం వరకు భక్తి గీతాలను ఆలపిస్తూ ముందుకు సాగారు. మూడు రోజుల పాటు ఉత్సవాలు కొనసాగుతాయని ఆలయ కమిటీ అధ్యక్షుడు చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహాశివరాత్రికి ప్రత్యేక పూజలు

కందనూలు: జిల్లా కేంద్రంలోని ఎర్రగడ్డ కాలనీలో ఉన్న సుబ్రహ్మణ్యేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు సర్వ వెంకటేశ్వరశర్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీషోడా సుందరేశ్వర స్వామికి ఉదయం నుంచి రాత్రి వరకు ప్రత్యేకంగా అభిషేకాలు, అర్చనలు కొనసాగుతాయని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు శివ పార్వతుల కల్యాణ మహోత్సవం, అదేరోజు రాత్రి12 గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహిస్తునట్లు వివరించారు.

కోడేరు: మండల కేంద్రంలో ఈ నెల 7 నుంచి 9 వరకు ఉమామహేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ అర్చకుడు జంగం శివయ్య మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 7న శివ సంకల్పం, గణపతిపూజ, అఖండ దీపారాధన, పుణ్యవాచనం, జగద్గురు పంచాచార్య, నవగృహ, కలశస్థాపన, రక్షాబంధన్, అగ్ని ప్రతిష్ఠ, 8న గణపతిపూజ, సర్వదేవతా పూజా అభిషేకాలు, తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయని వివరించారు. అదేవిధంగా 9న ఉమామహేశ్వర స్వామికి కల్యాణ మహోత్సవం, పూర్ణాహుతి, బలిహరణ, మహానివేదన, మహామంగళహారతి, తీర్థప్రసాదరణ, అన్నదానం పల్లకిసేవ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

అన్నిరంగాల్లో మహిళలు రాణించాలి

అచ్చంపేట రూరల్: అన్నిరంగాల్లో మహిళలు రాణించాలని ఏసీడీపీఓ కమల కోరారు. మంగళవారం అచ్చంపేట, బొమ్మన్‌పల్లితో పాటు పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు ఉపన్యాస, పాటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆడపిల్లలపై వివక్ష చూపొద్దని తల్లిదండ్రులకు సూచించారు. అనంతరం గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. అదేవిధంగా దుర్గాభవానీ ఆరె కటిక మహిళా సంఘం అధ్యక్షురాలు మండికారి లక్ష్మీబాయి ఆధ్వర్యంలో మహిళలను సన్మానించారు. జాతీయ కటిక సమాజ్ ఆలిండియా కార్యదర్శి మండికారి బాలాజీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో మండికారి ఝాన్సీరాణి, కోశాధికారి మల్లేకేడి లక్ష్మీబాయి, భవాని, నాగేంద్రబాయి, నర్సుబాయి, పద్మాబాయి, వైష్ణవి, సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.



బొమ్మన్‌పల్లిలో మహిళలకు బహుమతులు అందిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత: కేసు నమోదు

ఉప్పునుంతల: మండల సరిహద్దులోని దుందుబీ వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను మంగళవారం మండల కేంద్రంలోని పోచమ్మ చౌరస్తా ఎదుట పోలీసులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్ పోలీస్‌స్టేషన్‌కు తరలించి అచ్చంపేట మండలం నడింపల్లికి చెందిన డ్రైవర్ చౌట బాలుపై కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ సుజ్ఞానం తెలిపారు.

అచ్చంపేట రూరల్: ఎలాంటి అనుమతి లేకుండా అక్రమంగా ఇసుకను రవాణా చేస్తున్న రెండు ట్రాక్టర్లను మంగళవారం అచ్చంపేట పోలీసులు పట్టుకున్నారు. మండలంలోని లింగోటం సమీపంలో బ్లూకోర్టు కానిస్టేబుళ్లు వాహనాలను తనిఖీ చేస్తుండగా రెండు ట్రాక్టర్ డ్రైవర్ల వద్ద ఎలాంటి అనుమతి పత్రాలు లేకపోవడంతో అచ్చంపేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. డ్రైవర్లపై కేసు నమోదు చేశామని ఎస్ఐ రాము తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

బిజినేపల్లి: మండలంలోని మంగనూర్ గ్రామానికి చెందిన సైదులు నివాసంలో ఆరు క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని అధికారులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. మండల రెవెన్యూ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సంయుక్తంగా కలిసి మంగనూర్ గ్రామానికి చెందిన మానవపాడు సైదులు ఇంటిలో 13 తెల్లని సంచులలో రేషన్ బియ్యాన్ని గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని అదే గ్రామానికి చెందిన డీలర్ నాగమణికి అప్పగించారు. సైదులును అధికారులు విచారించగ పందుల దాణా కోసం గ్రామంలోని రేషన్‌కార్డుదారుల నుంచి రూ.10 చొప్పున కొనుగోలు చేసి నిల్వ ఉంచినట్లు తెలిపారు. సదరు వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు.

కాంగ్రెస్ గూటికి ఎంపీపీ, జెడ్పీటీసీ

బల్మూర్: ఎంపీపీ వేనేపల్లి అరుణ, జెడ్పీటీసీ సభ్యురాలు వి.లక్ష్మితో పాటు నాయకులు చుక్కారెడ్డి, భాస్కర్‌రెడ్డి తదితరులు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి సోమవారం రాత్రి హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే డా.వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు. మరో ఎనిమిది మంది ఎంపీటీసీలు కాంగ్రెస్‌లో చేరేందుకు సుముఖత ఉన్నట్లు సమాచారం. ఈ నెల 6న మహబూబ్ నగర్‌లో నిర్వహించే సీఎం సభలో చేరనున్నట్లు తెలుస్తోంది. వీరు కాంగ్రెస్‌లో చేరితో మండలంలో బీఆర్ఎస్ మనుగడ కష్టంగా మారనుంది.

బీఆర్ఎస్‌కు రాజీనామా

లింగాల: బీఆర్ఎస్‌కు జెడ్పీటీసీ నేజమ్మ రాజీనామా చేసి సోమవారం హైదరాబాద్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు, అచ్చంపేట ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు.

ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు



మాట్లాడుతున్న యూత్ అధ్యక్షుడు యాదగిరి

వెల్దండ: కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన గ్యారంటీ పథకాల అమలుపై ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదని బీఆర్ఎస్ మండల యూత్ అధ్యక్షుడు యాదగిరి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటై మూడు నెలలు గడువక ముందే 34 వేల ఉద్యోగాలు ఇచ్చామని ముఖ్యమంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కొత్తగా నోటిఫికేషన్లు వేసి యువతకు ఉద్యోగాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతులకు రూ.2 లక్షల రుణామాఫీ ఏమైందని ప్రశ్నించారు. రైతుబంధు పథకం ద్వారా పెట్టుబడి సాయం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శేఖర్, అశోక్, గణేష్, శ్రీను, రవికుమార్, శ్రీను, మహేష్‌యాదవ్, అమృనాయక్ తదితరులు ఉన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

పెద్దకొత్తపల్లి: మండలంలోని దేవల్ తిరుమలాపూర్, కల్వకోల్ గ్రామాల్లో సీసీ రోడ్డు మధ్యలో విద్యుత్ స్తంభాలు దర్శనమిస్తున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని గ్రామస్తులు భయాందోళనకు గురవుతున్నారు. వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. బిక్కుబిక్కుమంటూ ప్రయాణించాల్సిన దుస్థితి నెలకొంది. దేవల్ తిరుమలాపూర్ నుంచి వనపర్తికి వెళ్లే ప్రధాన రహదారిపై గతేడాది సీసీ రోడ్లు నిర్మించారు. విద్యుత్ స్తంభాలు తొలగించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంలేదని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



దేవల్ తిరుమలాపూర్‌లో విద్యుత్ స్తంభం ఇలా..

సీసీ రోడ్డు నాణ్యతగా చేపట్టాలని వినతి

కల్వకుర్తిరూరల్: మండలంలోని కుర్మిద్దలో జాతీయ ఉపాధిహామీ పథకంలో భాగంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులు నాణ్యతగా చేపట్టాలని గ్రామానికి చెందిన కృష్ణారెడ్డి, విజయభాస్కర్, భాస్కర్‌లు మంగళవారం డివిజనల్ పంచాయతీ అధికారి దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. నాసిరకమైన ఇసుకను వినియోగిస్తున్నారని వివరించారు. సీసీ రోడ్ల నిర్మాణ పనులను పరిశీలించాలని కోరారు.



వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

శివమాలధారులకు ఫలహారం పంపిణీ



మన్ననూరులో శివభక్తులకు పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ వైస్ఎంపీపీ సంబు శోభ

కోడేరు: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో శివ స్వాములు మంగళవారం ఇరుముడి కార్యక్రమం చేపట్టారు. శివ స్వాములు ఆయా దేవాలయాల్లో శివ పార్వతులకు ప్రతేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీశైలం క్షేత్రానికి కాలనడకన బయలుదేరారు. భక్తులకు మైనార్టీ నాయకులు నయీమ్, మాసూంబాబా అన్నదానం చేశారు. అలయ అర్చకుడు జంగం శివయ్య తెలిపారు.

దోమలపెంట: శివనామ స్మరణతో నల్లమల మార్మోగుతుంది. దోమలపెంటలో రాత్రి వేళ వివిధ ఆలయాలలో శివమాలధారులు విశ్రాంతి తీసుకుంటున్నారు. శ్రీశైలం ఆనకట్ట మీదుగా శ్రీశైలం చేరుకుంటున్నారు. స్వాములకు పండ్లు, మజ్జిగ, వాటర్ బాటిల్స్ అందిస్తున్నారు.

మన్ననూర్: శివమాలధారులకు స్వచ్ఛంద సంస్థలు అల్పాహారం, అన్నదానం, పండ్లు అందిస్తున్నారు.



దోమలపెంటలో..

అదేవిధంగా ప్రభుత్వం తరుపున అక్కడక్కడ స్వాములకు వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు.

తాడూరు: మండల కేంద్రంలో శివస్వాములు ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో స్థానిక శివాలయంలో పూజారి జంగంశంకరయ్య పూజలు నిర్వహించారు. బుధవారం ఆలయ ఆవరణలో శివపార్వతుల కల్యాణంతోపాటు అభిషేకం, హోమాలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు.

పశువుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించొద్దు



పశువులకు టీకాలు వేస్తున్న పశువైద్యాధికారులు

చారకొండ: పశువుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహించొద్దని మండల పశువైద్య అధికారి శివకుమార్ రైతులను కోరారు. మండలంలోని జూపల్లి, చారకొండ తదితర గ్రామాల్లో మంగళవారం పశువులకు గాలికుంటు నివారణ వ్యాధి టీకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ నెల 31వ తేదీవరకు టీకాలు వేస్తామని వివరించారు. కార్యక్రమంలో వీఎల్ఓ షేక్ మధర్, గోపాల మిత్ర శివరాం, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఉప్పునుంతల: మండల కేంద్రంలో 234 పశువులు, గేదెలకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు ఇచ్చినట్లు పశువైద్యాధికారి నరేందర్ తెలిపారు. నిర్దేశించిన తేదీల్లో ఆయా గ్రామాల రైతులు పశువులకు టీకాలు వేయించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది బాలకోటి, కమల, వెంకటేశ్వర్లు, హబీబ్, రైతులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు డబ్బులు చెల్లించాలి



రాచూర్,లికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి



తాడూరులో పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఏపీఓ

వెల్దండ: ఉపాధి కూలీలకు సకాలంలో డబ్బులు చెల్లించాలని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రాచూర్, పెద్దాపూర్, కుప్పగండ్ల గ్రామాల్లో ఆయన ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతుల వ్యవసాయ పొలాలను చదును చేయుట, కంపచెట్లు తొలగింపు, వాలు కట్టలు వేయడం తదితర పనులను చేయించాలన్నారు. పెద్దాపూర్‌లో పోస్టాఫీసు ద్వారా అందిస్తున్న కూలీడబ్బులను పరిశీలించారు. అదే విధంగా రాచూర్‌లో గ్రామ పంచాయతీలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గుత్తి వెంకటయ్యయాదవ్, గ్రామ ప్రత్యేక అధికారి తిరుపతి నాయక్, ఇన్‌చార్జ్ ఏపీఓ ఈశ్వర్, ఈసీ దేవేందర్‌గౌడు, కార్యదర్శులు, ఫీల్డ్‌అసిసెంట్లు తదితరులు ఉన్నారు.

చారకొండ: గ్రామాల్లో ఉపాధి కూలీలకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీఓ లక్ష్మయ్య కోరారు. మంగళవారం చారకొండ, జూపల్లి, తిమ్మాయిపల్లి గ్రామాల్లో పర్యటించి ఉపాధి పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. ప్రతి గ్రామంలో కూలీల సంఖ్య పెంచాలని ఎఫ్ఏలకు సూచించారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని పని ప్రదేశంలో తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. కూలీల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. వారి వెంట ఉపాధి అధికారులు తదితరులు ఉన్నారు.

తాడూరు: మండల కేంద్రంతోపాటు యాదిరెడ్డిపల్లి, ఇంద్రకల్ గ్రామాల్లో ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీఓ జ్యోతి, ఏపీఓ చంద్రసిద్ధార్థలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన గ్రామసభలో ఉపాధి పనులపై కూలీలకు అవగాహన కల్పించారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కూలీల సంఖ్య పెంచేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఫీడర్‌చానల్ పనులు త్వరితగతిన పూర్తిచేయాలని కోరారు. కార్యక్రమంలో గ్రామస్తులు, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



బహుమతులు అందుకుంటున్న విద్యార్థినులు

కల్వకుర్తిరూరల్: మండలంలోని పంజుగూల ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులు మంగళవారం స్వయంపాలన దినోత్సవాన్ని నిర్వహించుకున్నారు. పాఠశాలలోని 30 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి బాసునాయక్ బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం ఎల్లయ్యగౌడ్, గణేష్, కృష్ణయ్య, ఉమాదేవి, పుష్పలత, పాండయ్య, భాగ్యమ్మ, తిరుపతమ్మ పాల్గొన్నారు.

నేడు రైతులతో సీఎం వీసీ సమావేశం

వంగూరు: వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు ఆధునిక, సాంకేతిక విధానాలపై అవగాహన కల్పించేందుకు రైతు వేదికల్లో వీసీ ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా పైలెట్ ప్రాజెక్టు కింద ముఖ్యమంత్రి సొంత గ్రామమైన వంగూరు మండలం కొండారెడ్డిపల్లి గ్రామాన్ని ఎంపిక చేశారు. ఇటీవల అందుకు సంబంధించిన టీవీ, ఇతర సాంకేతిక పరికరాలు ఏర్పాటు చేశారు. బుధవారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వంత గ్రామానికి చెందిన రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడనున్నారు. ఇందుకు సంబంధించి అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయం

లింగాల: బాలల హక్కుల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్నామని జిల్లా చైల్డ్ లైన్ 1098 నిర్వహకురాలు ప్రమీల అన్నారు. మంగళవారం మండలంలోని అంబట్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డీడబ్ల్యూఓ విజయలక్ష్మి ఆదేశాల మేరకు బాలల హక్కుల పరిరక్షణ, బాల్య వివాహాల నిర్మూలనపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చదువుతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. సమావేశంలో హెచ్ఎం తాహెర్‌పాషా, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అధికారుల సహకారంతోనే అక్రమ వెంచర్లు

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీలో అధికారులు, ప్రధాన ప్రజాప్రతినిధుల సహకారంతో అక్రమ వెంచర్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయని కాంగ్రెస్ కౌన్సిలర్లు కౌన్సిలర్లు శ్రీను, రవీందర్, బాలునాయక్, ఆరోపించారు. మంగళవారం పట్టణంలోని జీఎస్ఆర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పట్టణంలోని సాయిబాలాజీ ఫంక్షన్ హాలు వెనకాల ఉన్న 746/ఈ సర్వేనంబర్‌లో రెండు ఎకరాలకు అనుమతులు తీసుకున్నారని కాని మరో నాలుగు ఎకరాలను అక్రమంగా వెంచర్ చేశారన్నారు. అనుమతులు లేని వెంచర్లకు రైతుబంధు కూడా జమ అవుతోందని దీనికి సంబంధించిన పత్రాలను చూపించారు. 2022లో ఆగస్టు నెలలో సాక్షి దినపత్రికలో 'అక్రమ వెంచర్ పంచాయతీ' శీర్షిక పేరుతో కథనం ప్రచురితమైందని గుర్తు చేశారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా 2023 ఆగస్టు వరకు రైతుబంధు పెట్టుబడి సాయం జమ అయ్యిందన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ కౌన్సిలర్లు

ప్రస్తుతం నేటికి ధరణిలో సదరు సర్వేనంబర్‌కు సంబంధించిన భూమి సాగుభూమి గానే రికార్డులలో ఉంది. మున్సిపల్ అధికారులు, ప్రధాన ప్రజాప్రతినిధి, మరో కౌన్సిలర్ అండతో సదరు కౌన్సిలర్ భర్త ముడుపులు ముట్టజెప్పి అక్రమంగా వెంచర్‌లో ప్లాట్లను విక్రయించారని వివరించారు. అనుమతులు లేని ప్లాట్లను విక్రయించిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కౌన్సిలర్లు శ్రీను, రవీందర్, బాలునాయక్, చిన్న రాంరెడ్డి, శ్రీధర్, షానవాజ్, వెంకట్‌రెడ్డిలు పాల్గొన్నారు.

వాయిదా వేయాలి

పాన్‌గల్: ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహించే బీఈడీ పరీక్షలను వాయిదా వేయాలని ప్రజా సమస్య పోరాట రాష్ట్ర అధ్యక్షుడు చిక్కోండ్ల రమేష్ మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. పీయూ బీఈడీ సిలబస్ మారడంతో టెస్ట్ పేపర్స్ మార్కెటులోకి ఇంకా రానందున పరీక్షలను వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు.